క్లుప్తంగా

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మహిళలకు కుట్టుమెషీన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

జగదాంబ : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఆదివారం జీవీఎంసీ 39వ వార్డులో చిలకపేటలో పేద మహిళలకు స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మెషీన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో కుట్టు మెషీన్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఇంట్లో పనులు చేసుకుంటు కుటుంబ పోషణకు కుట్టు మెషీన్ల ద్వారా ఉపాధి పొందవచ్చాన్నరు. ఈకార్యక్రమంలో ఎస్‌కేఎంఎల్ చైర్మన్ కొల్లి సింహాచలం, ముస్లిం నాయకులు యాసీన్, బాబ్జి, ముజిబ్‌ఖాన్, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహా వారాహి అవతారంలో అమ్మవారి దర్శనం



మహా వారాహి అవతారంలో వారాహి దేవి

అల్లిపురం: బంగారుమెట్ట షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన అనఘాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రులు సందర్భంగా అమ్మవారు ప్రతి రోజు ఒక ప్రత్యేక అవతారం, అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు ఆదివారం ఆషాఢ శుద్ధ సప్తమి సందర్భంగా మహా వారాహి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని గంధం, డ్రై ఫ్రూట్స్, చెర్రీస్‌తో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి పులిహోర ప్రసాదం నివేదన చేపట్టి, మారేడు ఫలం హారతితో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు వారాహి వార్తాహీ అవతారం..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం వారాహి వార్తాహీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. శ్రీకాకుళానికి చెందిన శ్రీ నటరాజ నాట్యమండలి వారిచే ప్రదర్శన వినాయకకౌత్వం నృత్యాంశంతో ప్రారంభమైంది. కళాకారులు జాస్మిత, స్నేహ, సింధు, మహిశ్రీ, హాసిని, వర్షిత నృత్యం చేయగా బిందుమహేశ్వరి నృత్య దర్శకత్వం వహించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భజనలు చేశారు.

రహదారుల ఆక్రమణ..ఆపై వాదన

- అడిగిన వారిపై దాడులు
- ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేసినా షరా మామూలే



సీపీఐ కార్యాలయం వద్ద రోడ్డులో మరమ్మతులకు గురైన ఆటోలు

అల్లిపురం: రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయి. రోడ్లను ఆక్రమించి ఆటో మరమ్మతుల షాపులు వెలుస్తున్నాయి. టింకరింగ్, సీట్ కవర్‌పనులు, పెయింటింగ్, వాటర్ సర్వీసింగ్ వ్యాపారులు బహిరంగంగా రహదారులు ఆక్రమించి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలగజేస్తున్నారు. నేర్లె కోనేరు హరిత లాడ్జి నుంచి వినాయకుని గుడివరకు, గోకుల్ థియేటర్ జంక్షన్ నుంచి ఏడుగుళ్ల స్లమ్ వరకు, సౌత్ జైలురోడ్డు, చావులమదుం జంక్షన్ వరకు మరమ్మతులకు గురైన ఆటోలతో రహదారులు నిండిపోతున్నాయి.

ప్రశ్నించిన వారిపై దాడులు

రహదారిపై ఆటోలు తీయాలని, రోడ్డుపై టింకరింగ్ పనులు ఏంటి అని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై ఆటో రిపేరు దుఖాణాల నిర్వాహకులు దాడులకు తెగబడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సాయంత్రం సమయంలో మరమ్మతులకు గురైన ఆటోల్లో చాలా మంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వార్నింగ్‌లు ఇస్తున్నారు. అంతేకాకుండా వాహనాలను తగులబెడుతున్నారు. ఇలా తరచూ అల్లిపురం ప్రాంతంలో జరుగుతున్న పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పట్టని ట్రాఫిక్, జీవీఎంసీ అధికారులు

అల్లిపురం, కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట తదితర ప్రాంతాల ప్రజలకు రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది వారితో లాలూచీ పడి కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నడవడానికి దారి ఉండడంలేదు

రోడ్డు మొత్తం ఆటోలు పెట్టి పెయింటింగ్‌లు, సీట్ కవర్ పనులు చేపట్టడంతో వాహనాలతో వెళ్లడం కష్టంగా మారింది. నడిచేందుకు కూడా దారి ఉండటం లేదు. ఉదయం, సాయంత్రం పాఠశాలలకు పిల్లలను తీసుకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎవరైనా అడిగితే అసభ్య పదజాలంతో సమాధానం చెబుతున్నారు. – కె.ప్రసాదరావు, కంఠంవారివీధి, అల్లిపురం

చర్యలు తీసుకుంటాం

ఇప్పటికే చాలా మార్లు ఫైన్‌లు వేశాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రహదారులు ఆక్రమించడం నేరం. ముఖ్యంగా రహదారులు ఆక్రమించినా, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించినా వారిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో పర్యవేక్షణ చేపడతాం.

–కె.శ్రీలక్ష్మి, ఎస్.ఐ, టూటౌన్ ట్రాఫిక్

'ఆదిపురుష్' వీక్షించిన అనాథ పిల్లలు



అనాథ పిల్లలతో జేసీఐ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: వారంతా అనాథ పిల్లలు. రోజూ తరగతి గదిలో పాఠాలు నేర్చుకుంటారు. ఆదివారం ఆటపాటలతో కాలక్షేపం చేస్తుంటారు. అయితే ఈ ఆదివారం వారికి ఓ స్వచ్ఛంద సంస్థ ఆదిపురుష్ సినిమాకు తీసుకువెళ్లింది. వందలాది మంది అనాథ పిల్లలు జగదాంబ థియేటర్‌లో సినిమా వీక్షించారు.

జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వైజాగ్ పోర్ట్ అమిగోస్ ఆధ్వర్యంలో 120 మంది అనాథలకు ఉచితంగా ఆదిపురుష్ సినిమాకు తీసుకువెళ్లింది. ప్రభాస్, కృతి సనన్ నటించిన ఆదిపురుష్ చిత్రం రామాయణం నేపథ్యం కావడంతో పిల్లలు ఎంజాయ్ చేశారు. ఆదిపురుష్ చిత్రాన్ని పిల్లలంతా బాగా ఆస్వాదించారని.. సినిమా చూస్తున్నంత సేపు వారి సంతోషానికి హద్దులు లేవని జేసీఐ వైజాగ్ పోర్ట్ అమిగోస్ ఎల్ఓఈ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శివ రాజ్, జాతీయ సమన్వయకర్త సేస్ మాధురి సామినేని, మాజీ అధ్యక్షుడు హెచ్‌జీఎఫ్ కేఎస్ఎస్ సాయి వర్మ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు..



ఆర్కే బీచ్‌లో అపూర్వ స్నేహితుల సందడి

డాబాగార్డెన్స్: వారంతా ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు. 20–30 ఏళ్ల కిందట ఏవీఎన్ కళాశాలలో విద్యనభ్యసించారు. వీరిలో పలువురు విదేశాల్లో స్థిరపడ్డారు. మరికొందరు దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడగా..ఇంకొందరు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉపాధి..ఉద్యోగరీత్యా నివాసముంటున్నారు. వీరంతా ఏవీఎన్ కళాశాల వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని నిత్యం యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా.. గ్రూప్ సభ్యులను ఆదుకునేలా..గ్రూప్ అడ్మిన్ లలితకుమారి ఆధ్వర్యంలో స్నేహితులంతా ముందుకు వస్తున్నారు. విదేశాల్లో స్థిరపడిన కొందరు పూర్వ విద్యార్థులు విశాఖ రావడంతో వీరంతా ఆదివారం ఆర్కే బీచ్ వేదికగా కలుసుకున్నారు. అప్పటి (కళాశాల చదివిన రోజుల్లో) జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. గ్రూప్ సభ్యుల్లో ఎవరెవరు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకుని వారికి చేదోడు వాదోడుగా ఉండేందుకు బాసటగా నిలిచారు. ఈ కలయికతో ఒకరినొకరి అభిప్రాయాలు షేర్ చేసుకున్నారు. పేద విద్యార్థులకు ఆదుకునేందుకు అందరూ ముందుకురావాలని తీర్మానించుకున్నారు.

కావ్యజ్ఞుడు ఆచార్య బేతవోలు

సీతంపేట: ఆచార్య బేతవోలు రామబ్రహ్మం కావ్యజ్ఞుడని, ప్రసిద్ధ విమర్శకుడిని వక్తలు కొనియాడారు. రచయిత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన 'కొత్త గోదావరి' పద్య కవితా సంపుటి పరిచయ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయిత పేరి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజన సాహిత్యం అంతా ఒకచోట ప్రతిబింబించేలా బేతవోలు రచించిన కొత్త గోదావరి కథా సంపుటి ఉంటుందన్నారు. ఆయన రచనల్లో విశ్వనాథ వారి ప్రబోధీప్తి, శ్రీశ్రీ సామాజిక స్పృహ, కరుణశ్రీ రసస్ఫూర్తి కన్పిస్తుందని పేర్కొన్నారు. కొత్త గోదావరి కవితా సంపుటిలో పది కథలు ఉన్నాయని తెలిపారు. ముందుగా గీతం వైస్ చాన్సలర్ ఆచార్య దయానంద సిద్ధపటం ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ప్రయాగ సుబ్రహ్మణ్యం అతిథులను సభకు పరిచయం చేశారు.

ప్రకృతితో ప్రయాణం

- జీవవైవిధ్య ఉద్యానవనంలో విజ్ఞాన యాత్ర
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రకృతి ప్రేమికులు



నీటిలో పెరిగే మొక్కలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రకృతి ప్రియులు



సీతాకోక చిలుకగా మారుతున్న గొంగలి పురుగు

ఏయూ క్యాంపస్: ఉషోదయం వేళ ప్రకృతితో మమేకయ్యారు. వేలాది మొక్కల నడుమ నడక సాగించారు. ఈ విజ్ఞాన యాత్రకు వేదికగా నిలిచింది రాణిచంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం. ఆదివారం ఉదయం ఏపీ అటవీ శాఖ, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సంయుక్తంగా ఉషోదయపు ప్రకృతి నడక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ యాత్ర సుమారు మూడు గంటల పాటు సాగింది. నగరంలోని విభిన్న రంగాల్లో స్థిరపడిన అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జురాసిక్ కాలం నాటి మొక్కల విశేషాలను పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథ రామమూర్తి, మంగతాయి దంపతులు వివరించారు. అనంతరం ఔషధ వనం, ఎడారి మొక్కలు, నీటిలో జీవించే మొక్కలు, అరుదైన రుద్రాక్ష చెట్టు, కృష్ణుడి వెన్న గిన్నె, సీతమ్మవారి జడ, అశోక వృక్షం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతీ చెట్టు, మొక్క సమాచారాన్ని తెలియజేస్తూ వాటిలోని ఔషధ విలువలు, వివరాలు వివరించారు. కీటకాలను తినే మొక్కలు, అరుదైన ఆర్కిడ్‌లు, విభిన్న రకాల పామ్ ట్రీలను తిలకించి సంబరపడ్డారు. గొంగలి పురుగు సీతాకోకచిలుకగా మారే ప్రక్రియను ఇక్కడ ప్రత్యక్షంగా చూసిన సందర్శకులు అచ్చెరువొందారు. అరుదైన, అంతరించే ప్రమాదం ఉన్న వేలాది మొక్కలను పార్క్‌లో సంరక్షిస్తూ, విద్యార్థులకు ఒక జ్ఞాన కేంద్రంగా దీనిని నిలుపుతున్నట్లు నిర్వాహకులు రామమూర్తి తెలిపారు. యువత డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని పార్క్ నిర్వహణ, సంరక్షణలో భాగం కావాలని కోరారు.



పార్కు విశేషాలను వివరిస్తున్న నిర్వాహకుడు రామమూర్తి

విస్తృత ప్రచారం అవసరం



మొక్కలంటే నాకు చాలా ఇష్టం. ఈ పార్క్‌ను తరచూ సందర్శిస్తుంటాను. ఇక్కడ ఉన్న వైవిధ్యమైన మొక్కలు మరెక్కడా చూలలేం. దీనికి విస్తృత ప్రచారం అవసరం. కృత్రిమ, అనుకూల పరిస్థితులను కల్పించి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి మొక్కలను పెంచుతున్న నిర్వాహకులకు అభినందనలు.

– ఆర్.నీహారిక, ఉద్యోగిని

తెలుసుకుని వచ్చాను..



విశాఖపట్నంలో ఇటువంటి పార్క్ ఉందని తెలియడంతో చూడాలని వచ్చాను. నేను ఇంట్లో కూడా అనేక రకాల మొక్కలు పెంచుతుంటాను. మొక్కల పెంపకం, సంరక్షించడం, వాటి ప్రత్యేకతలు ఇక్కడికి వచ్చాక తెలుసుకున్నాను.

– ఎం.సాయి ప్రణతి

అలరించిన 'ఝుమ్మంది నాదం'



చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్: విశ్రాంత పోలీసు అధికారి మహ్మద్ ఖాన్ స్థాపించిన గీత్ సంగీత్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం అలనాటి కథానాయకుడు చంద్రమోహన్ నటించిన చిత్ర గీతాలతో 'ఝుమ్మంది నాదం' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. అమ్మాజీరావు, కల్యాణి ఆలపించిన చిలిపి నవ్వుల నిన్ను చూడగానే, మహ్మద్‌ఖాన్..శైలజా మీరజ్ ఆలపించిన నీలి మేఘమా జాలి చూపుమా, భయ్యా శ్రీనివాస్, డాక్టర్ కృష్ణ హారిక ఆలపించిన సీతాలు సింగారం, డాక్టర్ కేఎల్ రావు, శ్రీదేవి పాడిన చిటికేయవే చినదాన, పి.రాంబాబు..డాక్టర్ నీహారిక పాడిన కంచిక పోతావా కృష్ణమ్మా, రమేష్ పట్నాయక్ పాడిన చేతికి గాజుల్లా, నాగు..లయ పాడిన నీ చూపులు గారడీ చేసేను వంటి గీతాలు ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. ముందుగా బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్‌తో సినీ నటులు ఎస్‌కే మిశ్రో, విశాఖ సంగీత కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. భీశెట్టి వేంకటేశ్వరరావు వ్యాఖ్యానం చేసిన ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, కళా సంస్థల ప్రతినిధులు కేవీ సత్యనారాయణ, వర్రె నాంచారయ్య, విజయ రమణి తదితరులు పాల్గొన్నారు.

అనధికార దుకాణాలు తొలగించాలి

- జోన్–4 జడ్సీ కె.శివప్రసాద్



పూర్ణామార్కెట్ వద్ద దుకాణాలు తొలగిస్తున్న జోన్-4 జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: పూర్ణామార్కెట్ దరి రహదారులపై అనధికార దుకాణాలు తొలగించాని జీవీఎంసీ జోన్–4 కె.శివప్రసాద్ సూచించారు. ఆదివారం ఆయన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వినయ్‌ప్రసాద్, సిబ్బందితో కలసి పూర్ణామార్కెట్ వద్ద అనధికార దుకాణాలు తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారులపై దుకాణాలు పెట్టకూడదన్నారు. మార్కెట్లో కేటాయించిన హద్దుల్లోనే దుకాణాలు పెట్టుకోవాలన్నారు. జీవీఎంసీ ఎవరికైతే లైసెన్సులు మంజూరు చేసిందో వారే మార్కెట్లో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. పార్కింగ్ స్థలాల్లో దుకాణాలు పెట్టకూడదన్నారు. రోజూ జీవీఎంసీ సిబ్బంది మార్కెట్‌ను పర్యవేక్షిస్తారన్నారు. ఎవరైన అక్రమంగా రహదారిపై దుకాణాలు పెడితే ఆయా దుకాణాలను డంపింగ్ యార్డుకు తరలిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో శానిటరీ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నార్త్–ఈస్ట్ క్లబ్ నూతన కార్యవర్గం



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పూర్వ గవర్నర్ శివప్రసాద్

డాబాగార్డెన్స్: విశాఖపట్నం నార్త్ ఈస్ట్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో జరిగింది. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ గవర్నర్ ఎం.ఉషారాజు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఉద్దేశించి మాట్లాడారు. లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. 2023–24కి గాను నార్త్‌ఈస్ట్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా సీహెచ్ కాశీవిశ్వనాథ్, కార్యదర్శిగా జి.జయశ్రీనివాస్, కోశాధికారిగా పీవీఎన్ మూర్తిచే పూర్వ గవర్నర్ డాక్టర్ వీఎస్‌వీడీ శివప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంజేఎఫ్ సీహెచ్ కృష్ణమూర్తి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'మమత'



గురుద్వారా బస్టాపులో పడిపోయిన వృద్ధుడ్ని పరామర్శిస్తున్న మమత, మురళి



కేజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్న దృశ్యం

అల్లిపురం: ఫిట్స్ రావడంతో రోడ్డుపై పడిపోయిన వృద్ధుడ్ని సమయానికి ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందేలా చూశారు మమత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మమత. గురుద్వారా బస్ స్టాప్‌లో ఆదివారం ఓ వృద్ధుడు ఫిట్స్‌తో పడిపోయాడు. అది గమనించిన స్థానికులు మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమతకు సమాచారం అందజేశారు. దీంతో ఆమె తక్షణమే స్పందించి రెడ్ క్రాస్ షెల్టర్ మేనేజర్ మురళితో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వృద్ధుడ్ని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించి అక్కడ చికిత్స అందజేయడంతో అతను కోలుకున్నాడని మమత తెలిపారు.

ఆరిలోవలో పెట్రోల్ దొంగలు



ఇటీవల రామకృష్ణాపురంలో పెట్రోల్ తీయడానికి తీసుకొచ్చి బైక్ వద్ద విడిచిపెట్టిన బాటిల్

ఆరిలోవ: చిల్లరి దొంగల బెడద ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో రోజురోజుకూ పెరిగిపోతోంది. రాత్రి వేళ ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ తీసేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇరుకు వీధులు.. వాటికి ఇరుపక్కలా చిన్నపాటి ఇళ్లు ఎక్కువగా ఉంటాయి. సెల్లార్లు అంటూ ఉండవు. దీంతో ఇళ్ల ముందు రోడ్డు పక్కనే వాహనాలు పార్క్ చేస్తుంటారు. ఇదే అదనుగా అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తుంటారు. ఖాళీ వాటర్ బాటిళ్లు తీసుకొచ్చి వాహనాల నుంచి ఎంచక్కా పెట్రోల్ చోరీ చేస్తున్నారు. తెల్లవారే సరికి పెట్రోల్ ట్యాంక్ ఖాళీ అయిన వాహనం చూసిన యజమాని లబోదిబోమంటున్నాడు. పనిమీద అర్జెంట్‌గా బయటకు వెళ్లాల్సినవారు ఆటోలు, బస్‌లు ఎక్కి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా రోజూ ఏదో ఒకచోట చిల్లర దొంగతనాలు జరుగుతున్నాని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, పాండురగాపురం, నెహ్రూ నగర్, టీఐసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, ముస్తఫాకాలనీ, గాంధీనగర్, తోటగరువు, ఇందిరానగర్‌లో నిత్యం పెట్రోల్ దొంగల హల్‌చల్‌తో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు.

- కొండవాలు ప్రాంతాల ప్రజలకు ఇది మరింత సమస్యగా మారింది. హనుమంతవాక నుంచి సంజయ్‌గాంధీకాలనీ, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్ పురంతో పాటు ఆదర్శనగర్ ప్రాంతం సుందర్‌నగర్ కొండవాలు, తోటగరువు, బీఎస్ఆర్ నగర్, బాలాజీ నగర్‌లో బీసీ కాలనీ ప్రాంతాలలో అందరూ రాత్రి వేళ ద్విచక్ర వాహనాలను కొండదిగువ రోడ్డు పక్కన వరుసగా పార్క్ చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల నుంచి పెట్రోల్ చోరీ ఎక్కువగా జరుగుతోంది. ఇటీవల రామకృష్ణాపురంలో రోజూ దొంగలు పెట్రోల్ తీసేస్తుండటంతో ఓ రోజు స్థానిక యువకులు కాపలాకాచి ఇద్దర్ని పట్టుకొని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి చినగదిలిలో రెండు బైక్‌లు, గాంధీనగర్‌లలో ఒక బైక్, డ్రైవర్స్ కాలనీలో ఒక బైక్‌లో పెట్రోల్ తీసేశారు. ఇప్పటికైనా ఆరిలోవ పరిసరాల్లో పోలీసులు నైట్ పెట్రోలింగ్‌పై మరింత ఎక్కువ దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిప్రదక్షిణకు ట్రాఫిక్ ఆంక్షలు

సీతమ్మధార: జూలై 2న సింహాచలం శ్రీలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు కాలినడకన తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలపై ఏసీపీ జాన్ మనోహర్ పలు సూచనలిచ్చారు. ఈమేరకు ఆదివారం ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సింహాచలం నుంచి బయలుదేరి హనుమంతువాక, వెంకోజీపాలెం, ఎస్‌ఏడీల వద్ద జాతీయ రహదారిపై కొంత మంది భక్తులు నడిచే అవకాశం ఉన్నందున 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు విశాఖ సిటీలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వచ్చే భారీ వాహనాలు, ప్రైవేట్ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో ఎక్కాల్సిన ప్రయాణికులు ఆనందపురం, పెందుర్తి, అనకాపల్లి వద్దకు చేరుకునేటట్లు బోర్డింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గిరిప్రదక్షిణ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

పోలీస్ సిబ్బంది ఆత్మీయ కలయిక

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లోని పలువురు కానిస్టేబుళ్ల బదిలీల నేపథ్యంలో ఆదివారం గురుద్వారా దరి ఓ హోటల్‌లో ఆత్మీయ కలయిక జరిగింది. బదిలీపై వచ్చిన వారు, వెళ్లిన వారు కలుసుకుని అభినందనలు తెలియజేసుకున్నారు.